# అగ్నిపర్వతాలు ....

రచన;
మాస్టర్ రవి, రాజాం.

భోజనం చేసి, అలసటగా వున్నందువల్ల మేనువాల్చి కళ్ళు మూసుకున్నాను. కనీసం ఓ అరనిమిషమైనా అలా వున్నానో లేదో, ఇంతలో 'మాష్టారుగారూ,' అని ఎవరో పిల్చారు. విన్నాను. కానీ, కళ్ళు తెరవలేదు కావల్నే... తిరిగీ, ఆ గొంతు కాస్త గట్టిగా పిల్చింది. ఇక లేవకపోతే, దగ్గరకొచ్చి కొట్టి లేపేట్టున్నాడని, విసుగ్గా 'ఆఁ' అన్నాను. 'నేనండీ...ఓ చిన్న విషయం' అన్నదా గొంతు. ఇక కళ్ళు తెరవక తప్పలేదు. తెరిచాను, ఎదురుగా గ్రామ పెద్ద సూరినాయుడుగారు, పెద్దమీసాలతో ప్రత్యక్షమైనారు. 'ఓహో...మీరా... రండ్రండి' అంటూ, పక్కనే ఖాళీగా వున్న కుర్చీని చూపించాను. తాగుతూన్న చుట్ట, నిర్లక్ష్యంగా రోడ్డు మీద గిరాటువేసి; కిర్రు చెప్పులు గుమ్మంవద్ద వదిలి, 'నమస్కారం' అంటూ ఆయన నాపక్క కుర్చీ నాక్రమించారు. 'ఏమిటి విశేషం? 'అన్నట్లు కళ్లు పెట్టాను. నాయుడుగారది గ్రహించి,' ఏం లేదు మాష్టారుగారూ! బీ. డీ. వో గారు వారి జీప్ లో ఓ యిద్దరమ్మాయిల్ని పంపించారు. వాళ్లు చాలా లేనివాళ్ళంట! బాగా పాడతారంట! ఈ మన వూళ్ళో, చిన్న కచ్చేరీ వేయించి, ఓ నాలుగురూపాయిలు వాళ్ళకిచ్చి పంపమన్నారు. ప్రతీ బ్లాకుల్లోనూ, వాళ్ళిలాగే ఏదో కలెక్షన్ చేసుకుని కాలక్షేపం చేస్తున్నారంట! తమరూ ఓసారి దయచేస్తే, ఈ సాయంత్రం మన స్కూలు గ్రౌండులో ప్రోగ్రాం (ప్రోగ్రామ్‌కి వచ్చినగతి ఇది...!) పెట్టిద్దాం. ప్రెశిడెంటు తమ్మినాయుడు కూడా, అక్కడే వున్నాడు 'హెడ్మాష్టరుగారొక్కరే తక్కువ...'అనగానే, తమ దగ్గర కొచ్చాను.' అన్నాడు. చిరాగ్గా ముఖం పెట్టి తప్పదు కాబట్టి, బాధగా 'సరే' నన్నాను. 'ఆఁ! చూడండి...సూరినాయుడుగారూఁ! ప్యూను చేతికి తాళాలిచ్చి పంపుతాను. ఆ అమ్మాయిల్ని స్కూలుగర్ల్స్ రూములో వుండమనండి. మీరు వెళ్ళి, నలుగుర్నీ పోగు చేసుకుని, నాలుగ్గంటలకి అక్కడ ప్రోగ్రాం ఫిక్స్ చెయ్యండి. నేను సరిగ్గా సమయానికి వచ్చి కలుస్తాను. పెద్దలందరితోనూ ఇదే విషయం చెప్పి, 'చందాపట్టీ' తయారు చేయించండి. ప్యూన్ చేత గ్రౌండు కాస్త బాగుచేయించండి.' అన్నాను కాస్త బోధపడే ధోరణిలో! సూరినాయుడుగారు, ఈ సెకెండ్లను వృధాకానీయక; చుట్ట కట్టుకునేందుకు, ఉపయోగించారు, 'చిత్తం' అంటూ ఆయన నిష్క్రమించే సరికి, 'హమ్మయ్య...ఓ పావుగంట విశ్రమించవచ్చనే 'ధీమాతో', తిరిగి కళ్ళు మూశాను. రెండేరెండు నిమిషాలో - నిమిషంన్నరో గడిచిందో లేదో' బాబూ నన్ను రమ్మని శలవట!' అంది ఓ పరిచయమైన గొంతు. రిఫ్లక్స్ యాక్షన్ వల్ల కళ్ళు తెరిచి, చూచి, చిరాగ్గా ముఖం పెట్టి 'సువ్వా... పోలయ్యా! నీ కెవరు చెప్పారు నే రమ్మన్నానని ఇదిగో తాళాలు, ఆ మేకున్నాయిగానీ. తీసుకెళ్ళి, స్కూలుగర్ల్స్ రూం తెరిచి క్లీన్ చేసి, ఆ అమ్మాయిల్ని అక్కడ వుండమను...' అన్నాను. మా స్కూలు ప్యూను పోలయ్యేతో! 'చిత్తం! సూరినాయుడుగారు సెప్పార్లెండి...ఇదిగో తాళా లొట్టుకెళ్తుండ... తమర్ని కసింత తొందరగా రమ్మని ఆరిశలవు' అంటూ, తాళాలందుకుని, పోలయ్య నిష్క్రమించాడు. టైము చూశాను. అప్పుడే రెండు సమీపించబోతోంది. 'ఈ వేళ కాస్త కునుకుపట్టే యోగం లేదా భగవాన్?' అని, దేవుడిముఖాన ఓ ప్రశ్న పారేసి; ఎలాగూ సమాధానం రాదని, మనకి తెలుసు కాబట్టి, తిరిగి కళ్ళుమూసి, కునుకు కోసం నిరీక్షించసాగాను. మగతగా, మందంగా, కునుకు రాసాగింది. సంతోషించ నారంభించేసరికి 'ఏమండీ! నిద్రోతున్నారా? ఎప్పుడూ ఎంతనిద్రో? మీకు నిద్ర వుంటే, అన్నంకూడా అక్కర్లేదు...' అంటూ తనొక్కర్తే మిగిలిపోయినట్లు, నా శ్రీమతి ప్రవేశించింది. ఆడది కాబట్టిన్నీ; అందులోనూ నా భార్య కాబట్టిన్నీ; అంత కేర్ చెయ్యక్కర్లేదనే నిర్లక్ష్యభావనతో, అలానే కళ్ళు మూసుకున్నాను. కనీసం 'కర్టెసీ కోసమైనా 'ఊఁ!' అనైనా అనలేదు. ఆమె మాత్రం తక్కువదనుకునేరు! ఓ పిలుపుతో సమాధానం లేకపోతే, సమాధానం వచ్చేవరకూ 'ఆయ్యో...నిద్రపోసి' అనైనా ఎంచక; అట్లా పిలుస్తూనే వుంటుంది. ఒకటి...రెండు మూడు...ఇట్లా ఓ అరడజనుసార్లు పిలిచేసరికి, నాలో విసుగూ, ఉద్రేకం కలిగి 'అబ్బ! వెధవగోల? కాకిగోలాని...ఒక్కటే దుంప తెంపేస్తూంటే...ఏవిటి నీ

గోల? ...కునుకు పట్టనివ్వరు గదా? అందులో ఇవాళ మరీను...నా అదృష్టం...' అన్నాను కళ్ళు తెరుస్తూ...

'అబ్బాసి...మేలుకునే నేవిటి వేషాలు? ఏదో, వంటాయింట్లో మగ్గిమగ్గి, మసిబొగ్గునై, యిలా వస్తానా - కులాసాగా మాట్లాడుకుందామంటే, సీరియస్‌గా, మీరు కునుకేస్తూంటారు...ఆఁ! ఏవిటి.. ఇంగాక, ఆ సూరినాయుడొచ్చి, ఏదో కచ్చేరీ అంటాడూఁ! నేనూ వస్తాను... ఎన్నిగంటల, కేవిటి?' అంది తమలపాకుల ఈనెలుతీస్తూ, సున్నం రాస్తూ, చిలకలు చేస్తూ...

నా కెలాగంటే అలా వొళ్ళు నుండిపోతుంది. ప్రతి రోజూ,మధ్యాహ్నం కనీసం ఓ అరగంటైనా, కునకలేకపోతే, ఇక ఆరోజంతా నాకు నరకమే! అందులో,ఇవేళ నాకు, అదోకలాగ చిరాగ్గాకూడా వుందేమో మరీను... నేనేం సమాధానం చెప్పలేదు కావాలనే. కాకపోతే: ఆమెవేపోసారి చూశాను అయిష్టంగా...ఆమె, ఏదో నా గూర్చి ఓ రెండుమాటలు గొణిగి; నా కోసం (కాబోలు?) కట్టిన తమలపాకుల చిలకలు, కసికొద్ది నా కివ్వక తనే నమిలివేయసాగింది. ఏం చెయ్యను? నోర్మూసుకుని పూరుకున్నాను.

మరో అయిదునిమిషాలన్నా గడిచాయో లేదో, చలపతి మాష్టారువచ్చి, నన్నుచూసి, మా ఆవిడతో, మాష్టారిగారు నిద్రపోతున్నటున్నారే! స్కూల్లో ఏదో ప్రోగ్రాం వుందన్నారు. నాయుడుగారు; వి యల్. డబ్ల్యు, మరిద్దరు పెద్దలు అక్కడవున్నారు. గ్రౌండులో బెంచీలూ గట్రా వెయ్యమంటారో లేక అలానే వుంచేయమంటారో కనుక్కుందామనీ..' నీళ్ళు నమిలాడు, నేను కళ్ళు తెరవడం గమనించి.

ఇలా నిమిష నిమిషానికీ, నాకు నిద్రాభంగం (ఖర్మ! తపోభంగంకంటే ఎక్కువగా వుందే!...) కలుగుతూంటే. వంటిమీద తేళ్ళూ, జర్రెలూ పాకుతూన్నట్లనిపిస్తోంది. అయినా ఏం చెయ్యను? భార్యగనక నా? ఇందంకలలాగ నోర్మూసుకు వూరుకోవడానికి...'బెంచీలెందుకండీ?...చల్లగా, చక్కగా పచ్చ తీవాసీలా వున్న గడ్డిమీద కూర్చోక! ఎదో...ఫార్మాలిటీ సేక్ ఓ రెండు బెంచీలూ-కుర్చీలు వేయించండి...పెద్దలన బడేవారు కూర్చుందికి...' అన్నాను. ఆయన వెళ్ళిపోయాడు. భగవంతునిమీద యీ మానవులమీద నాకా నిమిషం ఎంతో కోపం వచ్చిందంటే...'అంత'...!! ఇవాళ నా జాతకంలో నిద్రాయోగం లేదు కాబోలు! ఏం చేస్తాం? దేనికేనా పెట్టి పుట్టొద్దూ?' (ఖర్మ ఖర్మని...నిద్రకా యింత గోల?) అని, ఏం చెయ్యలేక శ్రీమతివంక, దూర్వాస దృక్కులు ప్రసరించి లేచాను, లుంగీ సవరించుకుంటూ...ఆమె ఎందుకో నవ్వింది....

పావు గంటలో, బాత్ రూంలో పనిచూసుకుని, నా మామూలు వేషధారణ, పేంటూ-షర్టూ టక్ చేసి, పైన కోటు వేసుకుని, కొంచెం ముఖానికి స్నో ఎప్లై చేసి అది కాస్త మందంగా ఉండటానికి ప్రక్కనే ఎదురు చూస్తున్న 'స్మిత్ టాల్కం' కోటింగిచ్చి; మా ఊర్లో రోడ్లన్నీ, సర్వకాల సర్వావస్థలయందు ఋతుభేదం లేకుండా, చల్లగా ఉండేందుకై కాబోలు, మోకాలులోతు బురదగా ఉంటవి కాబట్టి వాటర్ ప్రూఫ్ జోళ్ళు వేసుకుని, శ్రీమతి వేపు క్వశ్చన్‌మార్కు ముఖంతో చూశాను, 'కాఫీనీళ్ళు కాస్తపోయవా' అనే ఉద్దేశంతో! ఆమె ఆ ప్రోగ్రాం సంగతి చెప్పనందుకు ఇంకా కోపంగా వుంది కాబోలు..' ఇంకా నాలుగన్నా కాలేదు...మెతుకలింకా గొంతు దిగలే? అప్పుడేనా? మరో గంట కానివ్వండి,,,ఫ్లాస్కు కొన్నారుగా! స్కూలుకే పంపుతాను. ఆ రాజయ్యలేడూ... వాడ్ని పంపండి అంది.

ఏం చేసేది? ఇది ఆడవాళ్ళ యుగం! వాళ్ళ మాటకు ఎదురు వచ్చిందా, ఇక వంటాయింట్లో సామానుకి గాలి వచ్చి; రేపొద్దన్న శెట్టిగారి కొట్టుపద్దుకైనా, ఆ దెబ్బ. నేరుగా మనకే తగుల్తుంది. నేను యిలా అనుకున్నా 'పాపం! వంటాయింట్లో నలిగి నలిగి వస్తారు...వాళ్ళకామాత్రం రెస్టులేకుంటే ఎట్లా? రెస్టు ఎక్కిపోరూ? పడుకోనీ' అంది నా మనస్సు,' అవును అది నిజమే' అనుకుని పెద్దపెద్ద అంగలతో వీధిలోకి అడుగేశాను.

* * * *

సభాస్థలి బాగానే ఎరేంజ్ చేశారు. ఆరేడు బెంచీలు గ్రౌండు మధ్యగా వేసి; నాయుడుగారింటి తివాసీ దానిమీద పరిచారు. హార్మోనిస్టు, వయొలినిస్టు, మద్దెలిస్టు (డ్రమ్మర్) మా గ్రామంలో వాళ్ళే తయారై అందాకా 'మేరా జూతాహై జాపానీ' అనే హిందీ

పాటను, ముక్క ముక్కలూ చెక్క చెక్కలూ చేస్తూ 'ఏవిటీ వింత శబ్దం? అనేట్టు వాయిస్తున్నారు. దాదాపు ఏభై-అరవై మందిదాకా వక్రకారు ముందు కూర్చున్నారు. తలపాగాలూ, బనీన్లూ, చినిగిన కోట్లు వేసుకుని ఓ దజనున్నరమంది పెద్దలు కూర్చున్నారు. చేతిలో చేపాటి కర్రలు, నిటారుగా తలకాయల్నిమించి మరో అడుగు మీదకు కనిపిస్తోన్నాయ్ 'తంతారేమో?' అనుకున్నా; 'ప్రాంతియ పరిచయం' వల్ల భయపడలేదు.

నేను రావడం గమనించి, తమ్మినాయుడుగారూ, సూరినాయుడుగారూ, నన్నాహ్వానించి, కుర్చీ చూపించారు.' ఆ అమ్మాయిలెక్కడ?' అని అడిగాను. 'అదిగో ...వస్తున్నారు' అన్నాలు సరారి నాయుడుగారు. కుడి ప్రక్కనే నుండి వస్తున్న, 20-18 వయస్సులుగల ఓ ఇద్దరు తెల్లమ్మాయిల్ని చూపేరు. చూశాను.

కచ్చేరీ ప్రారంభమైంది. పాట, భైరవిలో వుంటే, మ్యూజిక్, మోహనలో పోతోంది. దాంతో, ఆ అమ్మాయిలు తారెత్తి మ్యూజిక్ లేకుండానే పాడతామని అనేసారు. భారత మాతను ప్రశంసిస్తూ ప్రారంభించారు. పాడే ప్రతీపాటా, జాతీయ గీతమో లేక త్యాగరాజకృతో అయిందిగాని; ఒక్కటీ సినిమా పోకిరీ పాట కాలేదు. నాలో నేనానందించాను; ఆ అమ్మాయిల పాటల సెలక్షన్‌కు—.

నా ప్రక్కనేవున్న చలపతిరావు మాష్టరుగారితో, నాకత్యంత ప్రియమైన 'నౌరంగ్' చిత్రంలో ఏమన్నా వస్తే పాడమనండి-అన్నాను. ఆయన వెళ్ళి రిక్వెష్ట్ చేశారు. ఓ పదినిమిషాల రెష్ట్ తర్వాత పాడతామన్నారు. మా వూరి ప్రబుద్ధులు, ఆ పదినిమిషాలూ వూరికినే పోకుండా, 'బావా...ఎప్పుడు వచ్చితీవు?' ఇత్యాది రఘురామయ్య బాణీ పద్యాలను, కొంత మంది కర్ణపుటాలకందించారు. ఆ సమయంలో, నేను, ప్యూను రాజయ్య తెచ్చిన-శ్రీమతి పంపిన కాఫీ త్రాగేసి, తిరిగీ కుర్చీ నాక్రమించాను.

ఆ అమ్మాయిలిద్దరూ, తిరిగీ వేదిక నాక్రమించి, 'నౌరంగ్' పాటలు నాలుగు, హృద్యంగా పాడేరు. నేను సినిమా చూస్తోన్నట్లు ఫీలయ్యాను.

ఈలోగా, సూరినాయుడుగారు, చందాపట్టి తయారుచేసి, నాకు చూపేరు. చూశేను. నలభై ఒక్క రూపాయి అయింది. నాపేరున తొమ్మిది రూపాయలు, విద్యార్థుల-టీచర్ల కంట్రిబ్యూషన్ ఎనిమిది రూపాయలు వేయించి, 'అర్ధనూటపదహార్లు' ఎనౌన్సు చేయించాను.

ప్రోగ్రాం బాగానే అయింది. సన్న సన్నగా చీకటి తెరలు, ఈ అందమైన ప్రకృతిని కప్పసాగాయి. ప్రేక్షకులంతా వెళ్ళిపోయారు. తమ్మినాయుడుగారూ, సూరినాయుడుగారూ, బీ. డి. వో. గారి మనిషీ, నేనూ, వున్నాం. ఎదురుగా ఆ ఇద్దరమ్మాయిలూ, నమ్రతగా నిల్చున్నారు. దగ్గరగా, ఆ అమ్మాయిల్ని చూస్తే, వారి ముఖాల్లో తాండవమాడే ఆవేదన, మనకు వేదన కలిగించకమానదు.

'ఏం అమ్మా! ఏదో మా గ్రామంలో ఈమాత్రమే వసూలు చేయించగలిగాం. చాలా బాగానే పాడేరు. అభివృద్ధిలోకి రాగల సూచనలున్నాయి. ఆఁ! అడగడం మరచానూఁ...మీ పేరు?'

'నాపేరు సంధ్య...మాచెల్లిలి పేరు విద్యం' అంది పెద్దమ్మాయి సన్నగా! తమ్మినాయుడుగారివేపు చూసి, 'ప్రకాశం హోటల్లో చెప్పి, ఓ అరడజను కాఫీ తెప్పించండి. పాపం...అమ్మాయిలకు గొంతెండిపోయింది' అన్నాను. తమ్మినాయుడుగారూ, సూరినాయుడుగారూ నిష్క్రమించారు.

సంధ్య, విద్యం ముఖాలు వివర్ణమైనాయ్. విషాద ఛాయలు అలనల్లన కనబడసాగాయ్. నేమేమో అనుకుంటూండగా, గొంతు సవరించుకుని, సంధ్య ఇలా చెప్పసాగింది. --

'మాష్త్రుగారూ! మా చరిత్ర అతి దుఃఖభాజనమైంది. ఇప్పుడు మేము విధికి ఎదురీదుతున్నాం. నిజానికి ఈ ప్రపంచంలో, మా అంత దురదృష్టవంతులుంటూరా? అని మాకే అనుమానంగా వుంది. మాది గుంటూరు. మా నాన్న శివకామయ్యగారు, సంగీతం మాష్టరుగారు. ఆయనకు మేమిద్దరమేగాక; మాకొక అన్నయ్య కూడా వుండేవాడు. వాడిపేరు రాంబాబు. నాలుగేళ్ళనుండీ, వాడు రైల్వేలో క్లర్క్‌గా వుండేవాడు. బెజవాడలో పనిచేస్తూండగా వాడికి, వాల్తేరు ట్రాన్స్‌ఫర్ అయింది. అర్నెల్లేనా సరిగా వాడువాల్తేరులో పనిచేశాడోలేదో?...ఆఁ...మాటల్లో చెప్పడం మరచాను. ...మా కేమంత పెద్ద చదువులు. మా నాన్న

చెప్పించలేక పోయారు. కుటుంబం గడవటమే అంత కష్టమైపోయే రోజుల్లో, చదువులకు మదుపు లెక్కడినుండి వస్తాయి? మా నాన్నకి ఓ మూడు ట్యూషన్లు వుండేవి. వాటివల్ల, ఏదో కుటుంబం గడిచేది. 'ఇలాకూడా మా కుటుంబం గడువకూడదు. మేం ఇలాగేనా బ్రతకూడదు. వీధి వీధి, గడప గడప అడుక్కుతినాలి. ఆడపిల్లలమైన మా బ్రతుకులు వీధిం పడాలి' ఇదీ ఆ దైవం ఆలోచించింది...నిర్ణయించింది... కనీసం మేం ఇలాగైనా వుండకుండా...ఆ దైవం, ఆ ఆర్తత్రాణ పరాయణుడు, ఆ దీనబాంధవుడు, ఆ సర్వేశ్వరుడు, కలలోనైనా తలచనిరీతిని; ప్రకృతినీతికి విరుద్ధంగా, మా అన్నయ్యను పొట్టను పెట్టుకున్నాడు. హృద్రోగం వల్ల, సడన్‌గా పోయాడని టెలిగ్రాం వచ్చింది. ఎందుకో, ఆ భగమంతుడు లేనిపోని బిరుదులు తగిలించుకున్నాడు? మా కింకెవరు దిక్కున్నారని, ఆ దేవుడు మా అన్నయ్య అసువులు తీశాడు? ఈ నిమిషానికైనా, ఇంకా మా అన్నయ్య బ్రతికేవున్నాడని అనుకుంటున్నాం. పిడుగువంటి ఈ దుర్వార్త, వృద్ధాప్యంలో మా వివాహ విషమై వేదనతో కుమిలి కృళ్ళిపోతూన్న, మానాన్న చెవినిపడి, అలా కుప్పలా కూలిపోయాడు, మా అమ్మ ఈ మాటవిని స్థంభించిపోయింది కొయ్య కట్టుక. పోయింది. తెల్లవారింది. నీరసింగా మేం లేచాం. పెరట్లో, నూతిలో, అమ్మశవం తేలుతోంది...మిన్ను విరగి, మేనుపై బడ్డట్టయింది. ఏం చెయ్యాలో, ఏమనాలో, ఏమీ బోధపడక, నిర్విణ్ణులమై పోయాము. మా వయసులు 20-18 సంవత్సరాలు మాత్రమే! ఇదంతా జరిగింది క్రితం సంవత్సరంమాత్రమే ఇంతలో, మానాన్న, ఎప్పుడు లేచాడో ఏమోగానీ, చొక్కా అంతా చింపేసుకుని, మా దగ్గరగా వచ్చి 'నా కొడుకేడీ? నా రాం బాబే డీ?...చెప్పూ...చెప్పవూ?...వాడు నీకేం అపకారం చేశాడు?,..ఇచ్చేయ్ .వాణ్ని నాకిచ్చేయ్...ఇవ్వకపోతే...నిన్ను...నిన్నూ...ఖంపేస్తా హాహాహా!!' అంటూ వెర్రిగా, పొలికేకలు వేస్తూ, మా అమ్మ శవాన్నైనా చూడకుండా; కనీసం చనిపోయిందన్నైనా తెలుసుకోలేని స్థితిలో ఇల్లువదలి వెడలిపోయాడు...ఇక మా పరిస్థితిగూర్చి మీకేం చెప్పను?...'

సంధ్య, కళ్ళు తుడుచుకుంది. విద్య పొంగిపొర్లి వచ్చే దుఃఖాన్ని పమిటచెంగు వెనక దాచుకో ప్రయత్నించి, విఫలమయింది. అప్రయత్నంగా నా కంటినాక్రమించిన, నీటిపొరని కళ్ళజోడు తీసి తుడుచుకున్నా...

'సంధ్యా! ఇకవద్దమ్మా! చాలుతల్లీ చాలు!! మీ విషాదగాథ నా హృదయాన్ని కలిచివేసి, కదిలించేసింది. చిరునవ్వుచిందే మీ నవ్వువెనుక, ఎన్ని అగ్నిపర్వతాలు-అఘాతాలూ దాగివున్నై? ఇంతచిన్నవయస్సులో, ఆ భగవంతుడు మీకెన్నికష్టాలు తెచ్చాడు? ఇక, అక్కడినుండి మీగాథ తెలిసిపోయింది....ఇప్పుడు పాపం...మీరెవ్వరూలేని నిరాధారులన్నమాట! విధి విచిత్రాలు అర్థం చేసుకోవటం చాలాకష్టం తల్లీ! ఇన్ని కష్టాలు వచ్చినా,మీరింకా తిరగగలుగుతున్నారంటే; మీ ధైర్యానికి మెచ్చుకోవాలి. ఇదే నేనైతే 'ధాం'మ్మని చచ్చేవాణ్ణి! సంబాళించుకో విద్యా! ఇలా కుమిలిపోతే ఎట్లా? జీవితం అంటే ఏమిటో, జీవించడం అంటే ఏమిటో, మిమ్మల్ని చూసి, ఈ లోకంలో చాలామంది నేర్చుకోవాలి. ఆఁ! కాఫీ తెప్పించారా?' అంటూ సూరినాయుడు గారివేపు తిరిగాను.

ఇద్దరూ కాఫీ త్రాగారు. బీ. డీ. వో. గారి మనిషి-'చీకటైపోయింది. సీతంపేట పోదామా?' అన్నాడు. సంధ్య, విద్యం లేచారు. ఏడ్చినందువల్ల, వారి ముఖాలు ఎర్రగా కందినై! తమ్మినాయుడుగారు జేబు గోంచి, కలెక్షన్ అయిన అర్థనూటపదహార్లు నా చేతికిచ్చారు. అవి వారిచేతుల్లోపెట్టి;-'సంధ్యా-విద్యా! సామాన్య కుటుంబీకున్ని, మిమ్మల్ని ఓ రెండురోజులైనా వుంచుకోలేని నిర్భాగ్యుణ్ణి. ఈ గ్రామంలో కలెక్షన్ అయింది ఇదిగో తల్లీ...వుంచండి' అంటూ సంధ్య చేతిలో వుంచాను. సంధ్య, తిరిగీ, ఎందుకో కళ్ళుతుడుచుకుని, ఆ సొమ్మందుకుని, తటాలున నా కాళ్ళపైబడి, పాదాభివందనం చేసింది. విద్యకూడా అనుసరించింది. వారి ప్రగాఢ భక్తికి, గౌరవానికి, నా కళ్ళనుండి తిరిగి వేడి నీటి భాష్పాలు నేల రాలినై.

బాధగా, కళ్ళు తుడుచుకుని, చూసేసరికి, 'జీప్' శబ్దం చేస్తూ కదిలింది. అందుంచి, ఆ అమ్మాయిలిద్దరూ చేతులూపుతున్నారు.

'వారిజీవితాలు?' వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళిపోయింది. 'వాళ్ళనీస్థితికి దిగజార్చిన ఆ భగవంతునికే తెలుసు' అని ఆకాశం వంక చూశాను.

(6వ పేజీ తరువాయి)

దానిపళ్లు యెన్ని బళ్ళకొద్దీ కోసుకున్నాము? నీకు గుర్తు లేదూ, దాని నీడక్రిందనేగా మన ఇవాన్కో పుట్టింది... మనవాళ్ళు రాత్రికి పొలాల్నుంచి రానివ్వు. వాళ్ళతో ఆలోచించాక యేదోఒకటి చెయ్యొచ్చు.'

అత్తయ్య కళ్లు తుడుచుకొన్నది. బలవంతంగా నవ్వు తెచ్చిపెట్టుకొంటూ 'ఏమంటావు?' అన్నది.

మళ్ళీ ఒకసారి వెక్కి నిట్టూర్చింది. ఆమెది జాలి గుండె. అలా నిట్టూర్చకపోతే ఉక్కిరిబిక్కిరయి ఉండేది.

గెరో ఆమెవైపు కన్నెత్తయినా చూడలేదు. మరింత గట్టిగా మూతి బిగించి సానపెడుతున్నాడు. ముక్కు మీద రెండు ముడతలు ఇంద్రధనుస్సుల్లాగ పడ్డాయి. సానపెట్టటం పూర్తిచేసి, లాగూ దులుపుకొని లేచి బయటికి వెళ్ళిపోయాడు.

గొంతు తెగ్గోసుకోడానికి పోతున్నాడేమో అన్నట్టు అత్తయ్య ఆయనవెనుకనే ఉరికింది.

అత్తయ్య ఒక్కతిమాత్రమే గెరో మామయ్యను అర్థంచేసుకోగలదు. అతని జాలిగుండె సంగతి ఆమెకు తెలుసు. అతని పరిస్థితి చూచి ఆమెకు యెంతో విచారం కలిగింది. పాపం ఆయన మనస్సు యెట్లాగుంటుంది! పదెకరాల భూమి పోవటమంటే మాటలా? సహకార వ్యవసాయ సంఘంలో చేరకతప్పదంటే చేర్తానని వాళ్ళతో అన్నాడు. కాని యీ బేరీపళ్ళ చెట్టును తన హృదయంనుండి యెలా దూరంచేసుకోగలడు!...'ఇతర్లు తన చెట్టుపళ్లు అనుభవిస్తుంటే చూస్తూ ఊరికే కూర్చోగలడా? లేదు, ఆచెట్టుకు యజమాని ఆయన. అందువల్ల నేను మధ్యకల్పించుకోగూడదనుకొన్నది అత్తయ్య. ఎటుతిరిగి యేమొచ్చినా అంతా తనపైన పడుతుంది. తన యిష్టంవచ్చినట్లే చేసుకోనివ్వు.

ఇలా అనుకొంటూ అత్తయ్య ముందు వాకిలికి వచ్చింది అదే సమయంలో గెరో మామయ్య గొడ్డలి చేతిలో పుచ్చుకొని గేటు తీస్తున్నాడు.

'సరే, గెరో దాన్ని కొట్టెయి, అది ఉన్నా లేకపోయినా యిప్పుడు మనకొకటే,' అన్నది అత్తయ్య.

మామయ్యను ఉద్దేశించి యీ మాటలు అన్నా ఆయన తనను కానట్టే వెనక్కు తిరిగయినా చూడలేదు.

'అనటం సులభమేగాని చెయ్యటం మాత్రం కష్టం,' అని గెరో మామయ్య తనలో తాను గట్టిగా అనుకొన్నాడు. సహకార వ్యవసాయ సంఘం అధ్యక్షుడు తనకంటే ముందు అక్కడ చేరుకొంటాడేమోనని గబగబా అడుగులు వేయసాగాడు. తనతోటలోకి పోయే దారి వంకర టింకరుగా ఉన్నది. పక్క తోటల్లోంచి అడ్డంగా పోతే దగ్గరే-కాని గెరో మామయ్యకి ఇతర్ల తోటల్లో అడుగు పెట్టటం యిష్టం లేదు. చక్కని గాలి వీస్తున్నది. చెట్టు ఆకులు తొడుగుతున్న సమయం. పొలాల్లో పనులు చేసుకోటం ప్రారంభించాల్సిన రోజులవి. బయటికి ఒకసారి వస్తే మళ్లీ యింటికి తిరిగి పోవాలనిపించదు.

గెరో మామయ్య తన పొలంకాడికి వచ్చాడు. బంగారంలాంటి భూమి. ద్రాక్షరతులు వేసినా, పండ్ల చెట్లు వేసినా అద్భుతంగా పండుతాయి. పొలానికి సరిగా మధ్యలో బేరీపళ్ళ చెట్టు ఉన్నది. బోదె మధ్యలో యెవరో కాటు పెట్టారు. ఆ కాటు మచ్చ గెరో మామయ్య బుగ్గమీద మచ్చల్లేనే కనబడుతున్నది. నాలుగు బలమైన కొమ్మలు బోదెనుండి విస్తరించి చక్కగా కనబడుతున్నాయి. ఎండుకొమ్మల్ని మామయ్య యెప్పటికప్పుడు కొట్టేస్తుంటాడు. కొమ్మలు కొట్టేసిన బుడిపెలు అక్కడక్కడా కనబడుతున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం అలాంటి బుడిపె ఒకటి తగులుకొనే మామయ్య బుగ్గ చీరుకుపోయింది. అసలు పూర్తిగా కన్ను పోవాల్సిన మాట. ఇప్పుడొక కన్ను చిన్నదై పోయి మీకు కనబడుతూనే ఉంటుంది. చెట్టు కొమ్మలు గాలి యెత్తుకు పెరిగిపోయి ఉన్నాయి. ఆ కొమ్మల్లోకి ఎక్కినప్పుడు మా యిల్లూ, మా అత్తయ్యగారి యిల్లూ చక్కగా కనబడుతుండేవి. అంత యెత్తన్న మాట, చుట్టుప్రక్కల ఎన్నో బేరీచెట్లున్నాయి. కాని అవేవీ దీనికి సరిరావు. వాటి పళ్ళు దీని పళ్ళంత తీపుకూడా ఉండవు.

చెట్టువంక చూస్తూ చూస్తూ నిలబడి గెరో మామయ్యకు అలసట కలిగింది. కిందకూలబడి చెట్టు మొదటకు చేరగిలబడ్డాడు. ఇలా తాను యెన్నిసార్లు విశ్రాంతి తీసుకున్నాడు! ముఖ్యంగా వేసంగిలో ఆ చెట్టునీడను కూర్చుంటే హాయిగా నిద్రపట్టేస్తుంది. గెరో మామయ్య

ఆలోచనలో పడ్డాడు....'నా పెళ్ళప్పుడు కావలసిన వస్తువులు కొనుక్కోటానికి అమ్మతో కలసి పట్నం వెళ్ళాను. మొక్కలు అమ్ముతూ ఉండటం ఒకచోట అమ్మ చూచింది. 'నాయనా, గెరో, ఒక మొక్క కొనుక్కో. మనపొలంలో నాటు. నీ పెళ్ళికి గుర్తుగా ఉంటుంది,' అన్నది. అదంతా జరిగి నిన్న మొన్నటిలాగ అనిపిస్తున్నది. అమ్మ చెప్పినట్లే మొక్క తెచ్చి నాటాను. అదంటే నాకు యెంత ప్రేమ యేర్పడింది! దానిని యెంతో జాగ్రత్తగా పెంచాను. నేల తీరో, లేక నా అదృష్టమో చెట్టు ఆకాశం అంటేట్టు పెరిగింది. మూడో సంవత్సరానికే పిందెలు పడ్డాయి. మొట్టమొదటి రెండు పళ్ళూ నేనూ, నాభార్య తిన్నాము. మా ఇవాంచోక్కు అప్పటికింకా పళ్ళు రాలేదు. వాడినోట్లోకూడా కొంత రసం పిండాము. వాడు యెంతో ఆనందంతో చప్పరించాడు. మామూలు బేరీపళ్ళలాంటివి కావీ చెట్టుపళ్లు. కమ్మని వాసనతో యెంతో తియ్యగా ఉంటాయి. పళ్ళు మా బంధువులకూ, స్నేహితులకుగూడా యిస్తుండేవాళ్లం. గెరో బేరీపళ్ళు అని ఊళ్ళో అంతా యెంతో ఘనంగా చెప్పుకొంటుండేవారు. 'ఎక్కడ దున్నుతున్నావ'ని అడిగితే గెరో బేరిపండ్లచెట్టుదగ్గర అని సమాధానమిస్తుండేవాడు. చెట్టు అంత ప్రసిద్ధికెక్కింది. చిన్నపిల్లలైతే పచ్చికాయలే దొంగతనంగా కోసుకుపోతుండేవారు. అందువల్ల నాన్న యెప్పుడూ చెట్టుకు కాపలా కాస్తూనే ఉండేవాడు. పక్షులు సహితం నా చెట్టుకేవచ్చి గూళ్ళు పెట్టుకొంటుంటాయి. ఇలాంటి చెట్టును పరాయివాళ్ళకు అప్పజెప్పెయ్యటమా! ఓరి భగవంతుడా...పరాయివాళ్ళు అనుభవించటమా....

గాలి మరింత జోరుగావీస్తూ కొమ్మలు కదలసాగాయి. గెరోమామయ్య ఆలోచనల్లోంచి మేల్కొన్నాడు. తాను వచ్చినపని గుర్తుకొచ్చింది. లేచినిలబడి చెట్టు వైపు ఆప్యాయంగా ఒకసారి చూచాడు. గాలికి చెట్టు మొగ్గ ఒకటిరాలి అతనిబుగ్గమీదపడ్డది. కన్నీటిబిందువులాగా గెరో భగవంతుడికొకసారి నమస్కారం చేసుకొని గొడ్డలి చేతికి తీసుకొన్నాడు. రెండుచేతుల్తో దానిని పట్టుకొని చెట్టుబోదెమీదికి బలంగా విసిరాడు. గొడ్డలి విసిరినమాట నిజమే, కాని అది యెట్లా జరిగిందో యేమో నాకు తెలియదు. చేతుల్లోని గొడ్డలి అలానే ఆగిపోయింది. కొద్దిసేపటికి గొడ్డలి నేలమీద పడిపోయింది. చెట్టు మామయ్యవైపు దీనంగా చూస్తున్నట్లనిపించింది. కన్నీటి చుక్కల్లాగ మొగ్గలు రాలి పడసాగాయి. అత్తయ్య కన్నీటి బిందువులు గుర్తుకొచ్చాయి.

మొగ్గలతో ముచ్చటగా పెండ్లికూతుర్లాగ కనబడింది చెట్టు. ఇరవైయైదు సంవత్సరాలక్రితం తనభార్య కనబడినట్టు. ఓరిభగవంతుడా, నా ప్రియమైన బేరీపళ్ళచెట్టును కొట్టెయ్యటమే.

ఇది పాపం...ఈ చెట్టును నేనే కొనేసుకొంటాను అనుకొన్నాడు మామయ్య తనలో తాను.

నమ్మూ నమ్మకపోండి, గెరో మామయ్య చెట్టు దగ్గరకువెళ్ళి యెంతో ఆప్యాయంగా దానిని నిమురుతూ లాలించాడు. గొడ్డలి చేతిలోకి తీసుకొని గ్రామం వైపు బయలుదేరాడు. అతని ముఖంలో ఆనందం తొణికిసలాడింది. పదడుగులు నడిచి ఒకసారి వెనక్కు తిరిగి చెట్టు వైపు చూచాడు. అతనివైపు చేతులు ఊపుతున్నట్టు కొమ్మలు గాలిలో ఆడసాగాయి!

*

విఠల్ ప్రొడక్షన్స్‌వారి

వరలక్ష్మీవ్రతంలో

మరొక దృశ్యం.

*

